సాక్షి అనకాపల్లి

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



రబీ సాగుకు అనుకూలం

ప్రస్తుత వాతావరణం రబీ సాగుకు అనుకూలమని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పి.వి.కె. జగన్నాథరావు తెలిపారు. 8లో



కోవిడ్ సేవలకు విమ్స్ సిద్ధం

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)ను కోవిడ్ రోగుల సేవల కోసం సిద్ధం చేశారు. 15లో



'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ

విశాఖ సాగరతీరంలో శనివారం 'ఆడుదాం ఆంధ్రా' అవగాహన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. 8లో

ఉత్తర ద్వార వైభవం



వైకుంఠవాసునిగా ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న అప్పన్న



ఉత్తరద్వార దర్శనానికి క్యూ లైన్లలో ఉన్న భక్తులు

- శేషతల్పంపై వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చిన అప్పన్న
- పరవశించిన భక్తజనం

సింహాచలం: వైకుంఠ వాసా పాహిమాం.. పాహిమాం.. అనాథ రక్షకా పాహిమాం.. పాహిమాం అంటూ భక్తుల శరణు ఘోషతో సింహగిరి మార్మోగింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శనం కనులపండువగా జరిగింది. ఆలయ ఉత్తర రాజగోపురంలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామి శేషతల్పంపై కొలువుదీరగా.. భక్తులు తనివితీరా దర్శించుకొని పరవశించారు.

ఒంటిగంట నుంచి వైదిక కార్యక్రమాలు

శనివారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వైదికులు పూజలు నిర్వహించారు. స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన చేశారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వైకుంఠవాసుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా తీర్చిదిద్దారు. అనంతరం స్వామిని, అమ్మవార్లను మేలిముసుగులో ఉంచి శేషతల్పంపై వేంజేపచేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. ఆలయ ఉత్తరద్వారం వద్ద కొంతసేపు వేంజేపచేసి స్వామిపై ఉన్న మేలిముసుగు తొలగించారు. అక్కడ తొలిదర్శనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు అందజేశారు. అక్కడి నుంచి స్వామిని తీసుకెళ్లి ఆలయ ఉత్తరరాజగోపురంలో వేదికపై వేంజేపచేశారు. ఉదయం 5.30 నుంచి 11.30 గంటల వరకు భక్తులకు దర్శనాన్ని అందజేశారు. అనంతరం స్వామికి సింహగిరి మాడవీధిల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రాజీవ్ లోచన్ పూజలు నిర్వహించారు.

విశేషంగా ఏర్పాట్లు

దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అన్నిశాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. అలాగే డీసీపీ ఆనంద్‌రెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. క్యూల్లో భక్తులకు, చిన్నారులకు బిస్కట్లు, మంచినీరు అందజేశారు. అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. దర్శనానంతరం భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనాన్ని పలువురు ప్రముఖులు చేసుకున్నారు. విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరధర్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఏయూ మాజీ వీసీ ప్రసాద్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ ఎస్పీ రామ్మోహన్, ఆర్డీవోలు భాస్కరరెడ్డి, సూర్యకళ, డీఈవో చంద్రకళ, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, దినేష్‌రాజ్, దొడ్డి రమణ, కె.నాగేశ్వరరావు, వంకాయల సాయినిర్మల, ముదుండి రాజేశ్వరి, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవివర్మ, బయ్యవరపు రాధ, పంచాడి పద్మ, దశమంతుల రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చందుయాదవ్, శేషారత్నం, వరలక్ష్మి స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

సింహాచలం.. మహా క్షేత్రం: స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం క్షేత్రం మహా క్షేత్రమని, యావత్ భారతదేశంలో ఉన్న నారసింహ క్షేత్రాల్లో కల్లా ఎంతో ప్రాముఖ్యమైనదని విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఉత్తరద్వార దర్శనం చేసుకున్న అనంతరం స్వామీజీ మీడియాతో మాట్లాడారు. ముక్కోటి ఏకాదశి రోజున మహా విష్ణువు స్వరూపాన్ని దర్శిస్తే ఐశ్వర్యం, భోగ భాగ్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. భగవంతుడి కృప దేశానికి, రాష్ట్రానికి పరిపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



రథంపై వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట : ముక్కోటి ఏకాదశి సందర్భంగా వడ్డాదిలో వైభవంగా గిరిప్రదక్షిణ జరిగింది. ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి కొలువైన గిరిజాంబ కొండచుట్టూ వేలాది మంది భక్తులు ప్రదక్షిణ చేశారు. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్తరద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చికున్నారు. తెల్లవారుజాము నాలుగు గంటల ప్రాంతంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబుకు ఈవో శర్మ తొలిదర్శనం కల్పించారు. భక్తుల రద్దీతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. శ్రీదేవి,భూదేవి,వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గిరిజాంబ కొండపై నుంచి కిందకు దించి వడ్డాది వీధుల్లో మేళ తాళాల మధ్య ఊరేగించారు. భక్తులు కొండ చుట్టూ మూడు కిలోమీటర్ల పొడవున గిరి ప్రదక్షిణ చేశారు.

రంగనాథుడిగా ఉపమాక వెంకన్న



రంగనాథునిగా భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



పుణ్యకోటివాహనంపై స్వామివారి తిరువీధి

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారు రంగనాథుని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారు శయనిస్తుండగా శ్రీదేవి,భూదేవి కాళ్లువత్తుతున్నట్టుగా అలంకరించిన రూపాన్ని భక్తులు దర్శించుకుని ఆనందంతో మురిసిపోయారు. దేశంలో ఏ ఆలయంలో లేని విధంగా స్వామివారికి ఎనిమిది అలంకరణలతో, ఎనిమిది వాహనాల్లో తిరువీధిసేవలు నిర్వహించారు. గరుడాద్రిపై కల్కి అవతారంలో షడ్భుజాలతో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా అర్చక స్వాములు కష్ణమాచార్యులు ఉదయం 3గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం గరుడాద్రిపై వెలసిన మూలవిరాట్ దర్శన భాగ్యాన్ని ఉత్తర ద్వారంగుండా భక్తులకు కల్పించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే మెట్లమార్గం భక్తులతో కిటకిటలాడింది. సాయంకాలారాధనలో భాగంగా నిత్యార్చనలు, బాలభోగ, రాజభోగనివేదన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని రంగనాథునిగా అలంకరించి పుణ్యకోటి వాహనం పైన, రాజాధి రాజ వాహనంలో ఆండాళ్లమ్మవారిని, సత్యభామ, రుక్మిణీ సహిత వేణుగోపాల స్వామిని పొన్నవాహనంలోను, ఆంజనేయ వాహనంలో సీతారాములను, హంస వాహనంలో శయన పెరుమాళ్లను, లక్కగరుడ వాహనంలో చిన్నికష్ణుని, గజవాహనంలో ప్రాకార పెరుమాళ్లను, పల్లకిలో బుల్లిరాముడిని వేంచేయింపజేసి ఉపమాక మాడ వీధుల్లో ఎనిమిది వాహనాల్లో స్వామివారు తిరువీధిసేవలకు బయలుదేరడంతో వందలాది మంది భక్తులు స్వామివారితోపాటు వెళ్లారు. ఉపమాక శ్రీనివాస భజన బృందం, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళాకారులు వాహనాల ముందు కోలాటాలు ప్రదర్శించడంతో పాటు భజన గీతాలు ఆలపించారు. తిరువీధిసేవల అనంతరం ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి బాలభోగనివేదన, రాజభోగనివేదన, విశేష పూజలు తీర్థగోష్ఠి, ప్రసాదవినియోగం జరిగాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు కష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, రామగోపాలాచార్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో డిప్యూటీ సీఎం బూడి



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శనివారం ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాలనాయుడు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎస్.రమేష్‌బాబు, బలరామ్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రాలను డిప్యూటీ సీఎం దంపతులకు అందజేశారు.

ఘనంగా సహజీవన యోగా సదస్సు



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నర్సీపట్నం: జగద్గురు పీఠం సోదర బృందం ఆధ్వర్యంలో బలిఘట్టం ఉత్తరవాహిని పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో 67వ సహజీవన యోగా సదస్సును శనివారం ఘనంగా నిర్వహించారు. మాస్టర్ ఇ.కె. నెలకొల్పిన గురుపూజా సంప్రదాయం ప్రకారం మూడు రోజుల పాటు ఆ సదస్సు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసదస్సును వి.వి.పూర్ణచంద్రరావు, యు.వి.ఎ.ఎస్.రాజు ప్రారంభించారు. భక్తులను ఉద్దేశించి పూర్ణచంద్రరావు ప్రసంగిస్తూ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు నీతిని బోధించడమే యోగా సదస్సు ముఖ్యఉద్దేశమన్నారు. ఈనెల25 వరకు సద స్సు జరుగుతుందన్నారు. సుప్రభాతం, యోగాసనాలు, ప్రవచనం, సుపథ విద్యార్థులచే పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహానికి బ్రేక్



బాల్య వివాహంపై విచారణ చేస్తున్న అధికారులు

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాల్యవివాహం జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు సీడీపీవో మేరీసువార్త పోలీసులతో శనివారం ఇక్కడికి వచ్చారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, బాల్యవివాహం వల్ల జరిగే అనర్థాలు వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేస్తే శిక్షార్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారావు, వైద్య, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న స్పందన రద్దు

తుమ్మపాల: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న రద్దు చేస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం అయినందున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి కలెక్టర్ కార్యాలయానికి రావద్దని ఆయన కోరారు.

సమీకృత వ్యవసాయంతో అధిక దిగుబడి

- ఉపాధి హామీ పథకం పీడీ సందీప్



కొండెంపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ సందీప్

బుచ్చెయ్యపేట: సమీకృత వ్యవసాయంతో రెట్టింపు పంట దిగుబడి, ఆదాయాన్ని సాధించవచ్చని, ఈ దిశగా రైతులు కృషి చేయాలని జాతీయ ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ) సందీప్ తెలిపారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఉన్నతి నైపుణ్యాభివృద్ధిపై శనివారం రైతులకు అవగాహన తరగతులు నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పూర్తి చేసుకున్న 24 మండలాల రైతు కూలీలు, మేట్‌లు, ఏపీవోలతో ఉన్నతి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రైతులు ముందుగా ప్రకృతిలో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటికి అనుగుణంగా పంటల సాగు చేపట్టాలన్నారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావానికి తగ్గట్టుగా శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అనుబంధ విభాగాల అధికారుల సూచనలు, సలహాల మేరకు సాగు చేయాలన్నారు. పంటల సాగు, మేలు రకాల విత్తన ఉత్పత్తి, దిగుబడులపై కేవీకే శాస్త్రవేత్తలు సత్తిబాబు, బాబు, కిషోర్, మహాలక్ష్మి, సౌజన్య, స్రవంతి తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. డ్వామా అదనపు పీడీ రోజారాణి, ఏపీడీ శ్రీనివాస్, మణికుమార్, ఏపీవో మురళి, ఈసీ కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలే బీమాకు ప్రామాణికం



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న రామారావు

అనకాపల్లి: పంటకోత ప్రయోగాలే పంట దిగుబడికి, ఇన్సూరెన్స్‌కు ప్రామాణికమని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి గేదెల రామారావు అన్నారు. మండలంలో కుంచంగి గ్రామంలో శనివారం వరి పంట కోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప గణాంక అధికారి శ్రీనివాసరావు, ఏఎస్‌వో శ్రీలక్ష్మి, వీఆర్వో కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అండగా కమిషన్



సదస్సులో మాట్లాడుతున్న సూర్యభాస్కరం

అనకాపల్లి: వస్తువుల కొనుగోలు, సేవలు పొందడంలో మోసపోయి, నష్టపోయిన వినియోగదారులు ఈ-దాఖిల్, నేషనల్ కన్స్యూమర్స్ హెల్ప్‌లైన్ వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎస్‌సీడీఆర్‌సీ) సభ్యురాలు సీహెచ్.వి.సూర్యభాస్కరం తెలిపారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక గౌరీ గ్రంథాలయంలో కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం, వినియోగదారుల రక్షణ అంశాలపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ-కామర్స్ కంపెనీల మోసాల నియంత్రణకు సెంట్రల్ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ అథారిటీ కృషి చేస్తుందని చెప్పారు. హక్కులు, ప్రయోజనాల రక్షణకు వినియోగదారులకు కమిషన్ అండగా నిలుస్తుందన్నారు. కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ మోసపోయిన వినియోగదారులు నేషనల్ కన్స్యూమర్స్ హెల్ప్‌లైన్ 1915 లేదా ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఔషధ నియంత్రణ అధికారి ఎస్.కల్యాణి, నెహ్రూయువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు, కన్స్యూమర్స్ రైట్స్‌సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు రేబాక మధు, రేషన్ డిపోడీలర్ల సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి పెంటకోట నాయుడు, ప్రతినిధులు పెతకంశెట్టి శివ, వి.ఈశ్వరరావు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బుద్ధ ప్రవీణ్, కాండ్రేగుల రవి, బొడ్డేడ జగ్గ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవ వెంకన్న సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్



వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న హైకోర్టు రిజిస్ట్రార్ రామకృష్ణ

ఎస్.రాయవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని హైకోర్టు రిజిస్ట్రార్ రామకృష్ణ, యలమంచిలి కోర్టు జడ్జి వీర రాఘవేంద్రరావు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు దంపతులు రిజిస్ట్రార్‌కు, జడ్జి కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు.

చిన్నారిని చిదిమేసిన లారీ



గాయపడిన దంపతులు మదీనావల్లి, హసీనాబీబీ



ప్రమాదంలో మృతి చెందిన అఫ్సీన్

- రేగుపాలెం వద్ద స్కూటీని ఢీకొని, వాహనంతో పరారైన డ్రైవర్
- విశాఖ నుంచి ఎస్.రాయవరం వెళ్తుండగా ప్రమాదం
- ముగ్గురికి గాయాలు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

యలమంచిలి రూరల్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఆరు నెలల చిన్నారి ప్రాణాలను బలిగొంది. అత్తారింటికి ఆనందంగా వెళ్తున్న విశాఖ మద్దిలపాలెంకు చెందిన మదీనావల్లీ కుటుంబం యలమంచిలి మండలం రేగుపాలెం హైవే కూడలి వద్ద శనివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. చిన్నారి మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు అందజేసిన వివరాల ప్రకారం విశాఖనగరం మద్దిలపాలెంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్న మహ్మద్ మదీనావల్లీ, భార్య హసీనా బీబీ, కుమారుడు మంజన్, 6 నెలల పాప అఫ్సీన్‌తో ఎస్.రాయవరంలో ఉన్న అత్తవారింటికి స్కూటీపై బయలుదేరారు. రేగుపాలెం హైవేకూడలి వద్దకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. దీంతో వారంతా రోడ్డుపై పడిపోయారు. రోడ్డుపై పడిపోయిన చిన్నారి అక్కడికక్కడే మరణించింది. ప్రమాదానికి కారణమైన లారీతో సహా డ్రైవర్ పరారయ్యాడు.

హైవే నిర్వహణ పనుల కారణంగా రహదారికి సగభాగం వరకూ స్టాపర్లు ఉండడం, లారీ డ్రైవరు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు, యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన మదీనావల్లీ, భార్య హసీనాబీబీ, కుమారుడు మంజన్‌లను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. మదీనావల్లీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. పరారైన వాహనం, అందుకు కారణమైన డ్రైవర్‌ను గుర్తించడం కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. కుమార్తె మరణించడంతో మదీనావల్లీ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వ్యసనాలతోనే దారి దోపిడీలు



8లో

వ్యసనాలతోనే దారి దోపిడీలు

17 నుంచి 22 ఏళ్లలోపు వారే వారంతా.. వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఐదుగురు కలిసి ముఠాగా ఏర్పడి నేరాల బాట పట్టారు. హైవేపై దారి దోపిడీలు, నేరాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్నారు. ఎట్టకేలకు యలమంచిలి రూరల్ పోలీసులు వారి ఆగడాలకు అటకట్టించారు. పట్టుబడిన నిందితుల్లో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉండటంతో విస్మయానికి గురయ్యారు.

- హైవేపై నేరాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠా
- నలుగురు అరెస్ట్, నిందితుల్లో ముగ్గురు మైనర్లు


నిందితుల నుంచి స్వాధీనపర్చుకున్న ఫోన్లు

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం షేకిళ్లపాలెం సమీపంలో ఈ నెల 19న అర్ధరాత్రి 16వ నంబరు జాతీయ రహదారిపై లారీ డ్రైవర్, హెల్పర్లపై దాడి చేసి రెండు స్మార్ట్‌ఫోన్లు, రూ.1,500 ఎత్తుకుపోయిన ఘటనలో నమోదైన కేసును పోలీసు ఛేదించారు. శనివారం సాయంత్రం యలమంచిలి రూరల్ పీఎస్‌లో పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. కణింకోటకు చెందిన కరణం బాలకృష్ణ ఈ నెల 19న తన లారీతో పిక్కరాయిని తీసుకొస్తూ యలమంచిలి మండలం షేకిళ్లపాలెం సమీపంలో కాలకృత్యాలకు ఆపాడు. దీనిని గమనించిన ఐదుగురు నిందితులు రెండు ద్విచక్ర వాహనాలపై ఆగిఉన్న లారీ వద్దకు వెళ్లి డ్రైవర్, హెల్పర్ల వద్ద సొత్తు ఇచ్చేయాలని కత్తితో బెదిరించారు. ఈ క్రమంలో లారీ డ్రైవర్ ప్రతిఘటించడంతో అతనిపై కత్తితో దాడి చేశారు. వారి వద్ద రెండు ఫోన్లు, రూ.1500 దౌర్జన్యంగా దోచుకున్నారు. దీనిపై బాధితుడు ఈ నెల 20న యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఐపీసీ 397 ప్రకారం కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై దర్యాప్తు చేపట్టారు. హైవేపై నిందితులు ప్రయాణించిన మార్గాల్లో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుల ఆచూకీ కనిపెట్టారు. ఐదుగురు నిందితుల్లో మామిడివాడకు చెందిన మోటూరి శ్యామ్ కుమార్, రాగుల పవన్‌లను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మిగతా ముగ్గురు నిందితులు మైనర్లు కావడం, వారిలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉండటంతో పోలీసులు విస్మయానికి గురయ్యారు. కేసులో ప్రధాన సూత్రధారి యలమంచిలి మండలం ధర్మవరానికి చెందిన మరో బాలుడు పరారీలో ఉన్నాడు. వీడిపై మరో ఎనిమిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. నిందితుల నుంచి పల్సర్ బైక్, స్కూటీ, రెండు ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మేజర్లపై రౌడీషీట్లు తెరుస్తామని డీఎస్పీ తెలిపారు. హైవేపై ఎలాంటి నేరాలకు పాల్పడినా తీవ్రంగా పరిగణిస్తామని, ఇలాంటివి పునరావృతం కాకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, కార్యకలాపాలపై జాగ్రత్తగా గమనించాలని సూచించారు. సమావేశంలో అచ్యుతాపురం సీఐ ఎం. బుచ్చిరాజు, యలమంచిలి రూరల్ ఎస్సై కె. సన్నిబాబు పాల్గొన్నారు.

రబీ సాగుకు వాతావరణం అనుకూలం

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణం రబీ సాగుకు అనుకూలమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ పి.వి.కె. జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన టీఎస్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిచాంగ్ తుపాను తర్వాత నేలలో లభిస్తున్న తేమశాతం రబీపంటల సాగుకు అనుకూలిస్తుందన్నారు. తుపాను వర్షాలకు వరిపంటకు మాత్రమే నష్టం ఏర్పడిందని, చెరకు, పెసర, మినుము, జనుము, నువ్వు, మొక్కజొన్న, చోడిపంటలకు అనుకూలించిందన్నారు. నేలలో లభిస్తున్న తేమను ఉపయోగించుకుని రబీపంటలు ముఖ్యంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో రబీపంటలకు అవకాశం ఎక్కువగా ఉందన్నారు. రబీపంటను ప్రోత్సహించడం ద్వారా అధిక ఆదాయాన్ని రైతులు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఏడీఏలు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీ



మస్కట్‌తో ఔత్సాహిక క్రీడాకారుల సందడి

విశాఖ స్పోర్ట్స్: విశాఖ సాగరతీరంలో శనివారం 'ఆడుదాం ఆంధ్రా' అవగాహన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం చెంత జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మూడు కిలోమీటర్ల మేర సాగిన పరుగులో పలు క్రీడలకు చెందిన ఔత్సాహికులు పాల్గొన్నారు. బీచ్‌రోడ్డులో ఉల్లాసంగా పరుగెడుతూ.. వైఎస్సార్ విగ్రహం వద్ద ముగించారు. తొలుత జేసీ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో భాగంగా తొలిస్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఐదు క్రీడాంశాల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి ఆర్.పూర్ణిమా దేవి, డీఈవో ఎల్ చంద్రకళ, ఆసియన్ మెడలిస్ట్ చింతా ప్రతాప్‌కుమార్ పాల్గొనగా.. డీఎస్‌డీవో జూన్ గాలియట్ పర్యవేక్షించారు. కోచ్‌లు సహకరించారు.

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP 21/2021 OS 39/2018
Between:
లాలం స్వామినాయుడు DHR/వాది
And
బోళెం నాగమణి 1వ JDR
బొత్సా రాంబాబు @ రామారావు 2వ JDR
బొత్సా వరలక్ష్మి 3వ JDR
JDRS/ ప్రతివాదులు

స్థిరాస్తి వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా! పై నెంబరు అమలు పిటీషనులో డిక్రీ బాకీ రాబట్టుకొను నిమిత్తము యిందలి 1 to 3 JDRs యొక్క ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్తిని పై కోర్టు వారు తే 08-01-2024దిన ఉదయం 10:30 గంటల లగాయతు సాయంత్రం 5:00 గంటల మధ్య సమయంలో వేలం వేయుదురు. కనుక వేలంలో పాల్గొనదలచినవారు పై తేదిన కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్ రిజిష్ట్రీ, నర్సీపట్నం మండలం, నర్సీపట్నం మున్సిపాలిటీ, 3వ వార్డు, 12వ బ్లాకు శానారి వీధి, డోర్ నెం. 3-12-61 గల స్థలం 70 చదరపు అడుగులు లేక 58.52 చదరపు మీటర్లు కలిపి సర్వే నెం: 163లో RCC స్లాబు ఇల్లు డోర్ నెం. 12-139/2, అసెస్‌మెంట్ నెం: 6135 ఎలక్ట్రికల్ సర్వీస్ మీటరు నెం: 14665 మరియు 13323, విస్తీర్ణం 400 చదరపు అడుగులకు కొలతలు మరియు హద్దులు:

కొలతలు:

తూర్పు నుంచి పడమరకు 13 అడుగులు లేదా 3.965 మీటర్లు, ఉత్తరం నుంచి దక్షిణంకు 18 అడుగులు లేదా 14.640 మీటర్లు

హద్దులు: తూర్పు: కూండ్రపు అప్పలనాయుడు ఇల్లు దక్షిణం: మున్సిపాలిటీ రోడ్డు, పడమర: బొత్సా రాంబాబు స్థలం, ఉత్తరం: నడింపిటి చెల్లయ్య ఇల్లు

DHR విలువ: 7,00,000/-
అమీనా విలువ: 12,00,000/-

K.R.V.SATYANARAYANA M.A., BL.
Advocate & Notary
Venkunaidupeta, Narsipatnam -531116,
Anakpalli Dist, Cell : 9849363542
నర్సీపట్నం
తే.23-12-2023

సమన్వయకర్త నియామకంపై బోగస్ ప్రచారం


మాట్లాడుతున్న చిక్కాల రామారావు


కోటవురట్లలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న నర్సింహమూర్తి

- సీఎం జగన్ నిర్ణయమే శిరోధార్యం
- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల

పాయకరావుపేట: స్థానిక నియోజకవర్గానికి నూతన సమన్వయకర్తను నియమించారంటూ కొంతమంది సోషల్ మీడియాలో పార్టీ లెటర్ హెడ్‌తో బోగస్ ప్రచారం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. పాయకరావుపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యమన్నారు. నియోజకవర్గంలో పార్టీకి బలమైన కేడర్ ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎమ్మెల్యే పదవిని త్యాగం చేసి జగనన్నకు అండగా నిలిచిన ఏకైక వ్యక్తి బాబూరావు అన్నారు. అతనికి జగనన్న అన్యాయం చేయబోరన్నారు. బాబూరావుకు టికెట్ ఇస్తే గతంలో కంటే రెట్టింపు మెజార్టీతో గెలుస్తారన్నారు. ఆర్చీకేలు, రైతుల కోసం మాట్లాడే నైతిక హక్కు జనసేన పార్టీకి, టీడీపీకి లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనితకు సవాల్ విసిరారు. ఆమె గత పాలనలో శంకుస్థాపనలకే పరిమితమయ్యారని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, జిల్లా పార్టీ పబ్లిక్ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సర్పంచ్ పస్నీరు బాబ్జి, ఉప సర్పంచ్ జగతా భవానీశ్రీనివాస్, నాయకులు గెడ్డమూరి శ్రీను, లోవకుమార్, మోహన్ పాల్గొన్నారు.

ఫేక్ న్యూస్‌పై ఆగ్రహం

కోటవురట్ల: ఆ రెండు పార్టీలు జట్టు కట్టినా గెలవలేమన్న భయంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో గందరగోళం సృష్టించేందుకు ఫేక్ న్యూస్ క్రియేట్ చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా ఆగ్రహించారు. శనివారం వారు కోటవురట్లలో మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం పేరున పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తను మారుస్తున్నట్టు ఓ ఫేక్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోందన్నారు. ఇటువంటి ఫేక్ న్యూస్ సృష్టించే కంటే ప్రజల మనసు గెలుచుకునే పనులు చేయాలని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాయకరావుపేట నియోజకవర్గంలో ఎవరిని నిలిపినా తామంతా కట్టుబడి గెలిపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, శానాపతి రామునాయుడు, టి.ఆంజనేయులు, ఎం.నానాజీ, సురేష్ పాల్గొన్నారు.

ఓర్వలేకే తప్పుడు ప్రచారం

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే సమన్వయకర్త నియామకంపై ఫేక్ ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి అన్నారు. శనివారం నక్కపల్లిలో ఆయన మాట్లాడుతూ జగనన్న నిర్ణయమే అందరికీ శిరోధార్యమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పనితీరు ఎంతో బాగుందన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సింహాచలం బోర్డు సభ్యురాలు శేషారత్నం, ఎంపీటీసీ లొడగల చంద్రరావు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, మాజీ ఎంపీపీ బాబ్జి, నాయకులు గొర్ల బాబూరావు, నాగ అప్పలరాజు, అల్లు రమణ పాల్గొన్నారు.

మారేపల్లిలో భారీ కొండ చిలువ హతం


రైతుల చేతిలో హతమైన భారీ కొండ చిలువ

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి గ్రామ శివారు పెనగంటి వారి కల్లాల వద్ద శనివారం భారీ కొండ చిలువ హతమైంది. సుమారు 11 అడుగుల పొడువున్న కొండ చిలువ పశువుల పాకలోకి ప్రవేశించి పశువులపైకి దాడి చేసేందుకు ప్రయత్నించింది. భయాందోళనకు గురైన పశువులు బిగ్గరగా అరవడంతో సమీప రైతులు అతి కష్టం మీద కర్రలతో కొట్టి దానిని హతమార్చారు.

బీసీ సాధికార యాత్రను విజయవంతం చేయండి


ఏఎల్‌పురంలో టీడీపీ కార్యకర్తను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: నర్సీపట్నంలో జరగనున్న బీసీ సాధికారయాత్ర విజయవంతానికి పార్టీ నాయకులందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ కోరారు. ఏఎల్‌పురం, చీడిగుమ్మల, జోగుంపేట గ్రామాల్లో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే గణేష్ సమావేశాలు నిర్వహించి, సాధికారిక యాత్రపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో బీసీ సాధికార యాత్రకు ప్రజలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు.

పార్టీలో చేరిన వీరగణేష్..

ఏఎల్‌పురం గ్రామానికి చెందిన వీరగణేష్ ఇటీవల టీడీపీలో చేరారు. ఆయన తిరిగి ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే గణేష్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ మణికుమారి, మండలపార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పలువురు కీలక నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి ఎస్సై కొలువు

- కింతలి వల్లాపురం గ్రామస్తుల ఆనందం


బోద నాని

మాడుగుల రూరల్: నిరుపేద పేద కుటుంబంలో పుట్టిన బోద నాని తొలి ప్రయత్నంలోనే ఎస్సై పోస్టుకు ఎంపికయ్యాడు. మండలంలో కింతలి వల్లా పురం ఎస్సీ కాలనీకి చెందిన అతడి తల్లిదండ్రులు శ్రీరాము లు, అప్పల నర్సమ్మ కూలీ పనులు చేస్తూ కుమారుడు నానిని చదివించారు. అతడు కింతలి ఎంపీపీతోపాటు హైస్కూలులో ఒకటి నుంచి పదో తరగతి వరకు, దేవరాపల్లి మండలం తెనుగుపూడి రెసిడెన్షియల్‌లో ఇంటర్మీడియట్, చోడవరం ఉషోదయ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. తాజాగా ఎస్సై పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదువుకుని ఉత్తీర్ణత సాధించాడు. దాంతో అతడి తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కింతలి, కింతలి వల్లాపురం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గ్రామస్తులు రావాడ కొండబాబు, దేముడమ్మ హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేడు వన సమారాధన

అనకాపల్లి: బొజ్జన్నకొండ వద్ద మాడుగుల జెడ్పీ హైస్కూల్ 1977వ సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థుల వన సమారాధనను ఆదివారం నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి జల్లు శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తమ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని కోరారు.

ఆసరా నాలుగో విడత బయోమెట్రిక్ సేకరణ



ఆసరా బయో మెట్రిక్ సేకరణను ప్రారంభిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత రుణమాఫీ వచ్చే నెలలో జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. మండలంలోని ఉగ్గినపాలెంలో నాలుగో విడత ఆసరా సొమ్ము జమ చేసేందుకు బయో మెట్రిక్ సేకరణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 1537 స్వయం సహాయక సంఘాలకు చెందిన 16,830 మంది సభ్యులకు మూడు విడతలుగా రూ.39 కోట్ల మేర రుణ మాఫీ జరిగిందన్నారు. నాలుగో విడతగా రూ.13 కోట్లు రానుందని, ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ కోసం వెలుగు సిబ్బందికి సభ్యులు సహకరించాలని కోరారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వేపాడ లక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ రామకృష్ణ, వీవోఏ పద్మావతి పాల్గొన్నారు.

టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ నిరసన



దీక్ష చేపడుతున్న న్యాయవాదులు

అనకాపల్లి: స్థానిక న్యాయ సముదాయం ముందు శనివారం ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్–2023ను రద్దు చేయాలంటూ న్యాయవాదులు శనివారం దీక్ష చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణరావు, న్యాయవాది ఐఆర్ గంగాధర్‌లు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. మహిళా న్యాయవాదులు ఎస్.నీలవేణి, జె.భారతీలక్ష్మి, ఎ.హిమగిరి, బి.రమాదేవి, బి.లీల, కె.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

తుమ్మపాల: ఈ నెల 26 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుడు బొమ్మలు రాము తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సమ్మె గోడపత్రికను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్మికులందరూ ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రం శెట్టి ఏసుదాస్, అజయ్ కుమార్, నూకరాజు, శివ పాల్గొన్నారు.

26న దత్త జయంతి

కశింకోట: మండలంలోని తేగాడలో వేంచేసిన దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఈ నెల 26న దత్త జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

'కనీస వేతనం అమలు చేయాలి'

తుమ్మపాల: కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో కార్మికులు సమావేశమై డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్‌రావు, జిల్లా కార్మిక శాఖ అధికారి సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ, యూనియన్ నాయకులు వై.నూకరాజు, ఎస్.సంతోష్, అడివి రాజు, పెంటకోట రాఘవ, వరలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

కశింకోట: స్థానిక పోలీసు స్టేషన్ పక్కన నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా 12వ రోజు దీక్ష కొనసాగించారు. ఎస్.నాగమణి, సీహెచ్ అన్నపూర్ణ, ఎస్.విజయ, తనూజ, ఎ.భవాని, బిఅమ్మాజి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

వాహన మిత్రతో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు భరోసా



నా పేరు బొండా బాలు. మాది రేబాక గ్రామం. 2014లో ఆటో తీసుకున్నాను. ఆటో నడుపుతూ, దాని ద్వారా వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ప్రతి రోజు సర్వీసు ద్వారా డీజిల్ పోను రూ.300 వరకు మిగిలేవి. వాటితో ఆటో మెయింటినెన్స్, ఇంటిల్లిపాది జీవనం సాగించేవాళ్లం. ఆటోకు ఏటా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి కావడంతో వడ్డీకి డబ్బులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇలాంటి సమయంలో ఆటో సర్వీస్ ద్వారా వచ్చే డబ్బులు వడ్డీలకే సరిపోయేవి. జగనన్న ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ వాహనమిత్ర పథకంలో ఏటా రూ.10 వేలు ఇస్తున్నారు. ఆ సొమ్ము ఆటో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వగైరా ఖర్చులకు భరోసానిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఎలాంటి అప్పు తీసుకోలేదు. నా ఆటోకు అన్ని అనుమతులు చేయించుకున్నాను. ఆటో సర్వీసుతో వచ్చిన సొమ్ముతో చాలా సంతోషంగా జీవిస్తున్నాం.



ఇతని పేరు కోట సంతోష్. రేబాక పంచాయతీ, గురజాడ వీరి నివాసం. ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులు అందిస్తుంటారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి రేషన్ సరకులను రేబాక, కాపుశెట్టివానిపాలెం, గురజాడనగర్‌లో ఇంటింటికీ చేరవేస్తూ ప్రభుత్వం ఇచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై వాహనాలు ఇచ్చినప్పటికీ ఇన్సూరెన్స్ నిమిత్తం జీతాల్లో కొంత కట్ చేసుకోవడం వీరికి ఇబ్బందిగా మారేది. ఫిట్‌నెస్‌కు సొంత డబ్బులను చెల్లించాలి. అంతంత మాత్రంగా ఉండే జీతంతో తమలాంటి వాళ్లు పడే ఇబ్బందుల్ని గుర్తించిన జగనన్న తమకూ వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా రూ.10 వేలు అందించడం చాలా ఆనందంగా ఉందని సంతోష్ చెప్తున్నారు. ఈ ఏడాది నుంచి పథకాన్ని అమలు చేయడంతో తనకు వచ్చిన రూ.10 వేలతో వాహనం కాగితాలు చేయించుకున్నట్లు తెలిపారు.





తుమ్మపాల: సీఎం జగన్ ప్రభుత్వం వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా రాష్ట్రంలో ఆటో, ట్యాక్సీ, మాక్సి క్యాబ్ నడిపేవారికి ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రజా సంకల్పయాత్రలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ బాధల్ని వైఎస్ జగన్‌కు చెప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్థిక భరోసా కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వైఎస్సార్ వాహనమిత్ర పథకానికి శ్రీకారం చుట్టి ఆటో, క్యాబ్, మాక్సి వాహన డ్రైవర్లకు ఏటా ఆర్థిక సాయం అందిస్తున్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ. 10 వేలు

ఎండీయూ ఆపరేటర్లకూ వాహన మిత్ర

అనకాపల్లి రూరల్, పట్టణ పరిధిలో రూ.9.48 కోట్ల లబ్ధి

ఇప్పటి వరకు అనకాపల్లి, కశింకోట మండలాలు, జీవీఎంసీ జోన్ పరిధిలో 9.48 కోట్ల నిధుల్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు.

కుటుంబంలో భర్త, భార్య, మైనర్ పిల్లలను ఒక కుటుంబంగా పరిగణిస్తారు. వాహనం ఓనర్‌షిప్, లైసెన్స్, రైస్ కార్డులో ఉన్న ఎవరి పేరు మీద అయినా ఉండవచ్చు. ఇతర రాష్ట్రాల్లో వాహనాల రిజిస్ట్రేషన్ ఉన్నవారు వెంటనే తమ అడ్రస్ మార్చుకోవాలి. దరఖాస్తుదారుని పేరిట వాహనం, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి.

విడతల వారీగా లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు అనకాపల్లి	లబ్ధిదారులు కశింకోట
2019	775	470
2020	872	510
2021	1202	450
2022	879	533
2023	938	557

వాహనమిత్రకు అర్హతలు

- లబ్ధిదారుడు సొంతంగా ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ కలిగి ఉండాలి.
- సరైన డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాల్సిందే.
- లబ్ధిదారుడి వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది ఉండాలి.
- ఆధార్ కార్డ్, తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలి.
- ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ కూడా తప్పనిసరి.
- ఒక కుటుంబానికి ఒక వాహనానికి మాత్రమే అమౌంట్ జమ చేస్తారు.

మరమ్మతులకే సరిపోయేది



గత పదేళ్లుగా ఆటోయే నా జీవనాధారం. ఫైనాన్స్‌పై సెకండ్ హ్యాండ్ ఆటోను కొనుక్కున్నా. మొదట్లో సర్వీసుల ద్వారా బాగానే ఉండేది. క్రమేపీ ఆటో రిపేర్లు పెరిగాయి. వచ్చిన డబ్బులు మరమ్మతులకే సరిపోయేవి. అలాంటి టైంలో జగనన్న ప్రభుత్వం మా ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం తెచ్చింది. నాలుగు సార్లు చెరో రూ.10 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. పాత ఆటోను మార్చి కొత్త ఆటోను కొనుగోలు చేశా. ఇపుడు మరమ్మతులు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ భయం పోయింది.

– శానాపతి శ్రీను, ఆటోడ్రైవర్

ఊరూ వాడా ముక్కోటి ఏకాదశి శోభ



దేవునిగుమ్మం వేంకటేశుని సన్నిధిలో రత్నాకర్



కశింకోట లక్ష్మీనృసింహస్వామికి పూలతో అందంగా అలంకరణ



వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో ఉత్తర ద్వార దర్శనం

అనకాపల్లి: పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాన్ని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించి, స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, గోవిందరావు దంపతులు ఆయనను ఘనంగా సత్కరించారు. స్థానిక గాంధీనగరం వేంకటేశ్వర స్వామి, గవరపాలెం దిబ్బవీధి లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆదినారాయణ, సభ్యులు సుంకర వెంకటేశ్వరరావు, అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబు, పార్టీ నేతలు కోటిపల్లి జేజిబాబు, కె.శ్రీను, భక్తులు పాల్గొన్నారు. గాంధీనగరం వెంకటేశ్వరస్వామిని కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు, 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు దర్శించుకున్నారు.

- గ్రేటర్ విశాఖ విలీన గ్రామం రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. 22 అడుగుల లక్ష్మీ సమేత వైకుంఠనారాయణస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులకు పసుపు, కుంకుమ, రవిక పంపిణీ చేశారు. మధ్యాహ్నం 5 వేల మందికి భారీ అన్న సమారాధన జరిపినట్లు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వజ్ర కవచాలంకృతునిగా కశింకోట ధ్యాన వేంకటేశుడు

కశింకోట: కశింకోటలోని పలు దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి వజ్ర కవచాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. భక్తులు ఉదయం నుంచి బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

- దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారిని పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి విష్ణు సహస్ర నామాలతో అర్చించారు. గరుడ, గజ వాహనాలపై వేణుగోపాలస్వామి, రాముల వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి కార్యక్రమాలను నిర్వహించారు.



ఆకట్టుకుంటున్న లక్ష్మీ సమేత నారాయణుడు

- స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ముక్కోటి ఏకాదశి సందర్భంగా పూలతో అందంగా అలంకరించి చందన స్వామిని భక్తులకు దర్శనం కల్పించారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు దర్శించి పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి కార్యక్రమాలు నిర్వహించారు.
- స్థానిక కోదండ సీతారామాలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీరామ పట్టాభిషేకం, సీతారాముల కల్యాణోత్సవాలను వైభవంగా శనివారం నిర్వహించారు. బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను నిలిపి ప్రత్యేక పూజలు జరిపారు. వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం, స్వామి వారి పట్టాభిషేకం అనంతరం ప్రసాద వితరణ చేశారు. రిటైర్డు హెచ్‌ఎం వేదుల వెంకటశాస్త్రి, డాక్టర్ మెరుగుమల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షులు వీరే



పల్లె వెంకట సీతారామ్ దొర



వేగి త్రినాథ్, టౌన్-2



ఉగ్గిన నూక అప్పారావు



దుంగల అప్పలనాయుడు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి పట్టణ, మండల యువజన విభాగ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్రకార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కూండ్రం గ్రామానికి చెందిన పల్లెల వెంకట సీతారామ్ దొర, జీవీఎంసీ జోన్ పరిధి టౌన్–1కు వేల్పులవీధికి చెందిన ఉగ్గిన నూక అప్పారావు సత్యనారాయణ, గవరపాలెం టౌన్–2కు వేగి త్రినాథ్, కశింకోట మండలానికి తీడ గ్రామానికి చెందిన దుంగల అప్పలనాయుడులను పార్టీ మండల యువజన అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



కార్పొరేటర్లను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి బారులు తీరారు. మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా అధ్యక్షుడు జాజుల రమేష్‌లు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు.

అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో ఉత్సవ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు పొండ్రంగి సత్యారావు, సభ్యులు కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజు రామకృష్ణ, బొండు జాడేష్, అద్దేపల్లి పోతురాజు, కుంచా దివాకర్, సందీప్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశుని కల్యాణం



కశింకోటలోని గవరపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

కశింకోట: స్థానిక గవరపేటలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నియోజక వర్గం నుంచి భక్తులు ఉత్సాహంగా హాజరయ్యారు. కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి తన్మయం చెందారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని నిర్వహించిన కల్యాణోత్సవంలో భాగంగా శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి, మహిళల కోలాటాలు, సన్నాయి మేళాలతో భారీ బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామి కల్యాణోత్సవాన్ని వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ మళ్ల జగదీష్, శైలజ దంపతులు, మళ్ల ప్రణయి, లోహిత దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి వారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. రూ.6,100కు కల్యాణ దంపతులు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. రెండు మహిళా బృందాలు ప్రదర్శించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. తొలుత మూల విరాట్‌ను అందంగా పూల మాలలు, తులసి మాలలతో అలంకరించి, భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

ఘనంగా తెప్పోత్సవం

శ్రీవారి తెప్పోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శారదానదిలో తాటి దోనెలపై శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి కల్యాణ విగ్రహాలను అందంగా అలంకరించిన వేదిక మీద నిలిపి పూజలు చేశారు. నదిలో విహరింపజేశారు. భక్తులు ఒడ్డు నుంచి దర్శించి తన్మయత్వం చెందారు. అనంతరం ఆలయంలో ఉయ్యాల సేవ, పవళింపు సేవ, పుష్పాంజలి నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి కల్యాణ చక్రవర్తిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

తుమ్మపాల: స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో శనివారం వికసిత్ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరై ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వ పథకాలను ఆన్‌లైన్‌లో చూపించారు. సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, కో కన్వీనర్ కశిరెడ్డి శ్రీను, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు వుడా రమేష్, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి భక్తసాయిరాం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండబాబు, పార్టీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల రథం షెడ్ ప్రారంభం

అనకాపల్లి: వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఊరేగింపు రథానికి ఎట్టకేలకు శాశ్వత గూడు ఏర్పడిందని 82, 83వ వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మిలు అన్నారు. స్థానిక వేల్పుల వీధిలో అమ్మవారి రథం ఉంచేందుకు నిర్మించిన షెడ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా ఎండకు ఎండుతూ, వర్షాలకు తడుస్తున్న రథానికి ప్రత్యేక గూడు కల్పించిన ఆలయ కమిటీ సభ్యుల చొరవను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లాకార్యదర్శి జాజుల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: స్థానిక కుంచావారి గౌరీపరమేశ్వరుల జాతర శనివారం సాయంత్రం నేత్రపర్వంగా మొదలైంది. జారత ప్రియులను పలు నేలవేషాలు, బండ్ల వేషాలు ఆకట్టుకున్నాయి. జాతరలో చిన్నారుల ఆటవస్తువులు రహదారికిరువైపులా అమ్మకాలు సాగాయి. రాత్రి 9 గంటల నుంచి జరిగిన పలు స్టేజ్ షోలు ఆకట్టుకున్నాయి. జాతరలో మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు, దేవతామూర్తుల విద్యుత్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కాళీమాత వేషధారణలో కళాకారులు

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



బంగారయ్యపేటలో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపులో గ్రామస్తులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల వంటకాలను పళ్లేల్లో తెచ్చి గౌరీపరమేశ్వరులకు నివేదించి, పూజలు చేశారు. అనంతరం ఊరేగించారు. శివాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



డైట్ కళాశాలలో కేక్ కట్ చేస్తున్న రత్నాకర్

అనకాపల్లి: శాంతి, కరుణ, సేవకు ఏసు ప్రతీకని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. కళాశాల ఆవరణలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు చూపిన మార్గంలో విద్యార్థులందరూ నడుస్తూ తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని సూచించారు. కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. విద్యార్థులకు ట్రెజర్ హంట్, స్పాట్‌గేమ్స్ నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకడమిక్స్ కె.పార్వతి, అసోసియేట్ డీన్ అకడమిక్స్ కృష్ణనాగ్, సిబ్బంది పాల్గొన్నారు.

- దాడి వీరునాయుడు కళాశాలలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ యావత్ ప్రపంచం నిర్వహించే అతి పెద్ద పండగ క్రిస్మస్ అన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, శాంతాక్లాజ్ ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.